# భవిష్యత్ తరాల కోసం పనిచేస్తా


మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

- మళ్లీ గెలిపిస్తే నగరానికి కంపెనీలను తీసుకువస్తాం
- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తాం
- మంత్రి గంగుల కమలాకర్
- తెచ్చుకున్న రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత యువతదే
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

కార్పొరేషన్, నవంబర్ 6 : తాము వచ్చే ఎన్నికల కోసం ఆలోచన చేయడం లేదని, వచ్చే భవిష్యత్ తరాల అభ్యున్నతి కోసం ఆలోచిస్తున్నామని, దాని కోసమే పని చేస్తామని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే మైదానంలో నిర్వహించిన యువగర్జన సభలో రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చిన యువత మంత్రికి ఘనస్వాగతం పలుకగా, వారినుద్దేశించి ఆయన మాట్లాడారు. భవిష్యత్ తరాలు బాగుండాలన్న ఆలోచనతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తున్నదని తెలిపారు. తాను ఒక భయం, ఆవేదనతో మాట్లాడుతున్నానని, ఇప్పుడు తెలంగాణను ఢిల్లీ చేతుల్లో పెడితే భవిష్యత్ అంధకారంగా మారుతుందన్నారు. యువత తన కోసం ఈ ఎన్నికల్లో పని చేస్తే తన రక్తాన్ని యువత కోసం ధారపోస్తానని తెలిపారు. కరీంనగర్ ఇప్పుడు షైనింగ్ సిటీగా మారిందని, ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా మానేరు రివర్ ఫ్రంట్‌ను తీర్చిదిద్దుతామన్నారు. తెలంగాణ అభివృద్ధిని చూసి ఈర్ష్యతోటి ఆంధ్రా నాయకులు విషం చిమ్ముతున్నారని, కేసీఆర్‌ను ఓడించి ఇక్కడి సంపదను దోచుకునేందుకు ఆంధ్ర నాయకులంతా బీజేపీ, కాంగ్రెస్ ముసుగుల్లో హైదరాబాద్‌లో అడ్డా వేశారని ఆరోపించారు. వారి మాటలు నమ్మి ఓట్లు వేస్తే యువతకు అరిగోస తప్పదన్నారు. తనను మరోసారి గెలిపిస్తే కరీంనగర్‌కు అమెరికా నుంచి కంపెనీని తీసుకువస్తానని, దీని వల్ల 5 వేల ఉద్యోగాలు వస్తాయన్నారు. అలాగే మానేరు రివర్ ఫ్రంట్ ద్వారా 3 వేల ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఇవన్నీ యువత కోసమే తాము చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇక్కడ తన కన్నా పెద్ద హిందువు ఎవరు ఉన్నారని ప్రశ్నించారు. ప్రతి ఏటా ఎంతో బ్రహ్మాండంగా వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నామని గుర్తు చేశారు. తాము దేవున్ని గుండెల్లో పెట్టుకుంటే, వాళ్లు దేవున్ని మతం, తమ స్వార్థ రాజకీయాల కోసం వాడుకుంటున్నారని మండిపడ్డారు. యువతను రెచ్చగొట్టి ఎంపీగా గెలిచిన ఆయన కేంద్రంలో తమ ప్రభుత్వమే ఉన్న ఒక్క రూపాయి కూడా అభివృద్ధి కోసం ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. బీజేపీ నాయకుల రెచ్చగొట్టే మాటలకు పడిపోతే భవిష్యత్ ఉండదని సూచించారు. భవిష్యత్ తరాలు బాగుండాలన్న లక్ష్యంతో పని చేస్తే బీఆర్ఎస్‌ను గెలిపించుకుంటారో రెచ్చగొట్టే పార్టీలను గెలిపిస్తారో యువత నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కేసీఆర్‌ను ఈ ఎన్నికల్లో కాపాడుకుంటే యువతను తాము కాపాడుకుంటామని హామీ ఇచ్చారు.

**రాష్ట్రాన్ని కాపాడుకునే బాధ్యత యువతదే: వినోద్‌కుమార్**

ఉద్యమించి సాధించుకున్న తెలంగాణను కాపాడుకునే బాధ్యత యువతపైనే ఉందని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ సూచించారు. ఆంధ్రా నాయకులు మళ్లీ తెలంగాణపై కన్ను వేసి ఇక్కడి సంపదను దోచుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని దుయ్యబట్టారు. అనునిత్యం రాష్ట్ర అభివృద్ధి కోసం ఆరాటపడుతున్న బీఆర్ఎస్ నాయకులపై ఢిల్లీ పార్టీలకు, ఇతరులకు అక్కసుగా ఉంటుందన్నారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ఒక్క ప్రాజెక్టు కడితే బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో ఐదు ప్రాజెక్టులను నిర్మించి కోటి ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఒకప్పుడు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఒక్క మెడికల్ కళాశాల కూడా లేదని, కానీ తాము ఇప్పుడు నాలుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో 35 ప్రభుత్వ మెడికల్ కళాశాలు ఉన్నాయని గుర్తు చేశారు. ఇలాంటి సమయంలో రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగిస్తే రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరిగా మారుతుందని హెచ్చరించారు. ఎంపీగా గెలిచిన బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోయారని, కానీ తాము ప్రతిపక్షంలో ఉన్న తాను ఎంపీగా ఉన్న సమయంలో కేంద్రం నుంచి రూ.1000 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు గుర్తు చేశారు. బీజేపీ పాలన ఉన్న రాష్ట్రాలకు రూ.వేల కోట్ల నిధులు మంజూరు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం రాష్ట్రం నుంచి నలుగురు ఎంపీలు ఉన్నా ఒక్క రూపాయి కూడా తీసుకురాలేకపోతున్నారని విమర్శించారు. ఇలాంటి పార్టీలను నమ్మకుండా అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేని మధు, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నాయకులు గంగుల ప్రదీప్, నందెల్లి మహిపాల్, వెంకట్, హరీశ్, తిరుపతినాయక్ పాల్గొన్నారు.


సర్కస్ గ్రౌండ్‌లో బీఆర్ఎస్ యువ గర్జన సమావేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తున్న యువకులు

# బీఆర్ఎస్‌ను గెలిపించాలి


మాట్లాడుతున్న మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్

- కాంగ్రెస్, బీజేపీలను నమ్మి ఆగంకావద్దు
- మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- బెజ్జంకి మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రచారం

బెజ్జంకి, నవంబర్ 6: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పార్టీ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రజలను కోరారు. మండలంలోని దేవక్కపల్లి, తోటపల్లి, వీరాపూర్, గూడెం, బేగంపేట, వడ్లూర్, తలారివానిపల్లి గ్రామాల్లో సోమవారం రోడ్ షో ద్వారా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాభై ఏండ్లలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని విమర్శించారు. ఆ పార్టీపై ప్రజల్లో నమ్మకం లేకే ఆరు గ్యారంటీల పేరుతో మోసం చేసేందుకు కుట్ర చేస్తున్నదన్నారు. కాంగ్రెస్ పాలనలో కేవలం రూ.200 పింఛన్ ఇచ్చేవారని, అది కూడా ఎవరైనా పింఛన్‌దారు చనిపోతేనే మరొకరికి వచ్చే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. కానీ, నేడు బీఆర్ఎస్ ప్రభుత్వం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఆసరా పింఛన్ ఇచ్చి ఆదుకుంటున్నదన్నారు. నాడు కరువు పరిస్థితులతో వేసిన పంటలు ఎండి ఎంతో మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని, అలాగే బతుకుదెరువు కోసం అనేక మంది వలస పోయారని పేర్కొన్నారు. కానీ నేడు ఇతర దేశాలు, ప్రాంతాల్లో స్థిరపడ్డవారు సైతం స్వగ్రామానికి వచ్చి ఆత్మగౌరవంతో తెలంగాణలో బతుకుతున్నారని తెలిపారు. నాడు ఆడబిడ్డ పెళ్లికి ఏ ప్రభుత్వం సైతం ఏకాణా సాయం చేయలేదని, నేడు పేదింటి ఆడబిడ్డల తల్లిదండ్రుల ఇబ్బందులు తెలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ కల్యాణలక్ష్మి, షాదీముబారక్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అంతేకాకుండా రైతులు సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రాజెక్టులు నిర్మించారని, పంట పెట్టుబడి సాయం అందిస్తూ వ్యవసాయాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చాక అందించే పథకాలు వివరించారు. ప్రజలు కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నమ్మి ఆగంకావద్దని, దూరదృష్టితో దేశం గర్వించేలా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీఆర్ఎస్ పార్టీకే 30 తేదీన ఓటు వేయాలని కోరారు. అనంతరం పలు గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన యువకులు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా ఆయా గ్రామాలకు ప్రచారానికి వచ్చిన రసమయి బాలకిషన్‌కు డప్పు చప్పుళ్లు, కోలాటాల మధ్య మహిళలు మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమాల్లో ఎంపీపీ లింగాల నిర్మల, జడ్పీటీసీ కనగండ్ల కవిత, పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చంద్రకళ, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


మంగపేటలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

# సంక్షేమ బీఆర్ఎస్ కావాలా.. స్కామ్‌ల కాంగ్రెస్ కావాలా?

- అబద్ధపు ప్రచారాలు చేసే వారిని నమ్మి మోసపోవద్దు
- ఎన్నికల్లో ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తా
- బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

గంగాధర, నవంబర్ 6: ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే బీఆర్ఎస్ కావాలా.. స్కామ్‌లు చేసే కాంగ్రెస్ పార్టీ కావాలో ప్రజలు ఆలోచించుకోవాలని బీఆర్ఎస్ చొప్పదండి అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని మంగపేట, చెర్లపల్లి(ఎన్), కాచిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్‌ను నమ్మి ఓటు వేస్తే కర్ణాటక రాష్ట్ర రైతుల మాదిరిగా అరిగోస పడుతామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాత్రి సమయంలో పొలం కాడికి పోవడానికి రైతులు మళ్లీ టార్చిలైట్లు కొనుక్కోవాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. ఐదు గ్యారంటీలతో కర్ణాటక రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు చేయకుండా చేతులెత్తేసిందన్నారు. ఎన్నికలు ముగిసిన వెంటనే అర్హులందరికీ గృహలక్ష్మి, బీసీ బంధును అందజేస్తామన్నారు. రైతు బీమా మాదిరిగా ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమా వర్తించేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి అబద్ధపు ప్రచారాలు చేసే వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. తనను ఆశీర్వదించి గెలిపిస్తే చొప్పదండి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీరాం మధుకర్, సింగిల్ విండో చైర్మన్లు దూలం బాలాగౌడ్, వెలిచాల తిర్మల్‌రావు, ఆర్బీఎస్ మండల కోఆర్డినేటర్ పుల్కం గంగన్న, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, సర్పంచులు తోట వేదాంతిమహిపాల్, పొట్టల కనకయ్య, జోగు లక్ష్మీరాజం, కంకణాల విజేందర్‌రెడ్డి, మడ్లపెల్లి గంగాధర్, వేముల దామోదర్, ఎంపీటీసీలు ఎగుర్ల మల్లమ్మ, నాయకులు ఆకుల మధుసూదన్, రామిడి సురేందర్, రేండ్ల శ్రీనివాస్, వంగల మల్లికార్జున్, కోల శ్రీనివాస్, సుంకె అనిల్, మదిరె మధు, ఇరుగురాల రవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా

- ఏ కష్టం వచ్చినా అండగా ఉంటా..
- కారుగుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించండి
- హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్, నవంబర్ 6: ప్రజాసేవ చేసేందుకే తాను రాజకీయాల్లోకి వచ్చానని, 15 ఏండ్లుగా ప్రజల మధ్యలోనే ఉంటున్నానని హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. ఏడుసార్లు గెలిచినా బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి ఏమీలేదని విమర్శించారు. సోమవారం మండలంలోని గుండేడు, కొత్తపల్లి, కన్నూరు, భీంపల్లి గ్రామాల్లో కౌశిక్‌రెడ్డి శాలినిరెడ్డి దంపతులు ఎన్నికల ప్రచారం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి, మీకుసేవ చేసే అవకాశాన్ని కల్పించాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మాట తప్పకుండా చెప్పిన పనులు చేసి చూపిస్తానన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గాన్ని సిద్దిపేట తరహాలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కౌశిక్‌రెడ్డి సతీమణి శాలినిరెడ్డి మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజల కోసం నిత్యం అందుబాటులో ఉంటూ, ఏ కార్యకర్తకు ఆపద వచ్చినా ముందుకు వచ్చే కౌశిక్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఏడాది కాలంగా నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులు మీ కళ్ల ముందు ఉన్నాయన్నారు. బీఆర్ఎస్‌కు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపిస్తే కౌశిక్‌రెడ్డి మరింత ఉత్సాహంతో పనిచేస్తారన్నారు. కాగా, బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తామని కన్నూరు గౌడ కులస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. వారికి కౌశిక్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు గ్రామాల్లోని యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కల్యాణి, సర్పంచులు పుల్లూరి రాంచందర్‌రావు, కల్యాణి, పద్మ, లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ వీరమనేని భాస్కర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ సంపత్‌రావు, డైరెక్టర్ సత్యనారాయణరావు, నాయకులు లక్ష్మణ్‌రావు, ప్రభాకర్, తిరుపతిరావు, వలీ, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


గుండేడులో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు